# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [11]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [11]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** మార్చి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=2068

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [11]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది ఆఖరి భాగం.***

దీని ముందుభాగం

కారు మబ్బులు తేలిపోయాక సూర్యుడు ప్రకాశించినట్టు ,ఆత్మ హత్య ఆలోచన విరమించుకున్న అజయ్ లో ఏదో కొత్త ఆశ, ధైర్యం వచ్చాయి. ఏదో ఒకటి చేయగలడు, ఆ మాటకొస్తే ఏదైనా చేయగలడన్న నమ్మకం వచ్చేసింది. కానీ ఏమి చేయాలనే ఆలోచనే తట్టటం లేదు. మళ్ళీ ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టాడు. కానీ అదే పరిస్థితి. ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. కానీ అజయ్ ఏ మాత్రం నిరుత్సాహాన్ని పొందలేదు.

ఒకరోజు వేణు ఫోను చేసి అమీర్ పేట రమ్మని చెప్పటంతో, అజయ్ అక్కడికి వెళ్ళాడు. "అమీర్ పేట్" ఆంధ్రప్రదేశ్ లో ఇంజనీరింగ్, చదివిన, చదువుతున్న వాళ్ళకి గుండె లాంటిదీ అమీర్ పేట. కృష్ణదేవరాయల వారి కాలంలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారని అంటారు. అలానే అమీర్ పేటలో కోర్సులు రాసులుగా పోసి అమ్ముతుంటారు. మనకి కావాల్సిన కంప్యూటర్ కోర్సులను మనకు కావలసినన్ని రోజుల్లో, కావాల్సిన రేటుకు రాసులుగా పోసి అమ్ముతుంటారు. నేర్చుకునే వాడంటూ ఉండాలేకాని ఏదైనా నేర్పుతారు. ఎప్పుడు వెళ్ళినా అందమైన అమ్మాయిలతో, వాళ్ళని కాపలా కాసే అబ్బాయిలతో నిండిపోయి ఉంటుంది. దాదాపుగా అంతా జంటలు జంటలుగా తిరుగుతుంటారు, సినిమాలకైనా ,కోర్సులకైనా.

అమీర్ పేటలోని మైత్రివనము దగ్గరకు వెళ్లి అజయ్ వేణుకి ఫోను చేశాడు. పది నిముషాల్లో వేణు కూడా అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరూ కలిసి ఆ మైత్రివనము వెనుక గల బహుళ అంతస్తుల సముదాయానికి వెళ్ళారు. కుర్చీలు ,బల్లలు నిండి ఉన్న ఒక మూడు గదుల ప్రదేశాన్ని అజయ్ కి

చూపించాడు వేణు. "ఇది నా స్నేహితుడొకడికి తెలిసినవాళ్ళది. ఇంతకుముందు ఇక్కడొక కంప్యూటర్ కోర్సులు చెప్పే సంస్థ ఉండేది. ఆర్థిక మాంద్యం కారణంగా అద్దెలు చెల్లించలేక మూసి వేయాల్సి వచ్చింది. వీళ్ళు చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇంకా ఓ సంవత్సరం వీళ్ళే అద్దె చెల్లించాలి. కొత్తగా ఎవ్వరూ ముందుకు రావటం లేదు. మనకు తక్కువగా వచ్చేట్టు ఉంది. నువ్వు "ఊ" అంటే మనం తీసుకుందాం" అన్నాడు వేణు.

"మనం తీసుకొని ఏం చేద్దాం, కూర్చొని పదమూడు ముక్కలు ఆడుకుందామా?" అని అడిగాడు అజయ్. "అక్కడికే వస్తున్నా! ఇప్పుడిప్పుడే మళ్ళీ పరిస్థితులు బాగుపడుతున్నాయి. మాంద్యం క్రమంగా మరుగున పడుతున్నది. నువ్వు ఎలాగూ మూడు ,నాలుగేళ్ళు ఈ సాఫ్ట్ వేర్ జాబ్ వెలగ బెట్టావు కదా ! నీకున్న ఆ నాలుగేళ్ల అనుభవంతో మనమే ఒక కొత్త బడి తెరుద్దాం. ఎలాగూ స్థలం తక్కువకు వస్తున్నది, కాబట్టి పిల్లలు రాకపోయినా మనకు నష్టం రాదు. ఆ గ్యారంటీ నాదీ !" అని వేణు భరోసా ఇచ్చాడు. ఇంతకు మునుపు పాఠాలు చెప్పిన అనుభవం ఉండటం చేతనూ, తనకు ఇంకో మార్గం లేకపోవటం చేతనూ తప్పక ఒప్పుకున్నాడు.

"కానీ ,మనం చెప్తామంటే వస్తారంటావా ?"అని అనుమానం వ్యక్తం చేశాడు అజయ్. "మనం ఏమి చెప్తున్నాము అన్నదానికన్నా ఎలా చెప్తున్నాము అనేది ముఖ్యం.నువ్వు సులభం గా చెప్పగలను అంటే చెప్పు ,మిగతా విషయాలన్నీ నేనే చూసుకుంటా" అని చెప్పాడు. అజయ్ సరే అన్నాడు. వేణు వెంటనే దానికి ఒక సంవత్సరానికి అద్దెకు తీసుకొనేట్టు ఒప్పందం రాయించుకొన్నాడు. పంతులుగారికి ఫోను చేసి మంచి పేరు, మంచి రోజు తెలుసుకొన్నాడు. వేణు తన పరిచయాలను ,తెలివితేటలను ఉపయోగించి పిల్లల్ని తీసుకురాగలిగాడు. తనకు తెలిసి స్నేహితులలో ఖాళీగా ఉన్న ఒక అమ్మాయిని "రిసెప్షనిస్ట్" గా నియమించాడు. అమీర్ పేటలో దాదాపు ఏ కంప్యూటర్ కోర్స్ కోసం వెళ్ళినా ముందు అమ్మాయిలు పలకరించి కూర్చోబెడతారు. కొంచెం పెద్ద సంస్థలైతే ఇద్దరు ముగ్గురు అమ్మాయిలను కూర్చోబెట్టి మరీ స్వాగతం పలుకుతారు.

మొదటి విడత శిక్షణ మొదలు పెట్టటానికి నెల రోజులు పట్టింది. యాభై మందికి పైగా పిల్లలు రావటంతో, తాము సగం విజయం సాధించామని ఇద్దరూ భావించారు. ఇక మిగిలింది, వీళ్ళకు శిక్షణ బాగా ఇచ్చి మంచి పేరు తెచ్చుకుంటే చాలనుకున్నారు. లాభాలు రాకపోయినప్పటికీ నష్టం రాకుండా మొదటి మూడు నెలలు గడచాయి. పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. మాంద్యం చాయలు పోయి పరిస్థితి అనుకూలంగా తయారు. తర్వాత ఆరు నెలలు లాభాలు సంపాదించారు. అజయ్ మళ్ళీ తన ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేశాడు.

లావణ్య కూడా అజయ్ దగ్గర శిక్షణ తీసుకోవాలని అనుకున్నది.అదే విషయాన్ని అజయ్ కి చెప్పింది. లావణ్యకు ప్రేత్యేక శ్రద్ధ తీసుకొని మరీ పాఠం చెప్పటం మొదలు పెట్టాడు. అదృష్టవశాత్తు అజయ్ కి మళ్ళీ ఒక అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగం వచ్చింది. తమ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే నిమిత్తం అజయ్ ని ఆ కంపెనీ వాళ్ళు నియమించుకున్నారు. దానితో అజయ్ దశ ఒక్కసారిగా తిరిగిపోయింది. రెండు చేతులా సంపాదించటం మొదలు పెట్టాడు. పొద్దునా ,సాయంత్రం వేణుతో కలిసి అమీర్ పేట లో, మిగతా సమయం ఆఫీసులో పనితో, క్షణం తీరిక లేకుండా రోజులు గడిచిపోతున్నాయి.

క్షణం తీరిక లేకున్నా లక్షణమైన లావణ్యను బుట్టలో పడేశాడు. బలహీన క్షణాలు లేకుండానే, బాగా దగ్గరయ్యారు. గత అనుభవాల దృష్ట్యా అజయ్ ముందుగానే ఒక విషయం లావణ్యతో తెల్చుకోవాలనుకున్నాడు. మొహమాటానికి పోకుండా ముఖం మీద అడిగేయాలని నిర్ణయించుకున్నాడు.

" మీ నాన్న మన పెళ్ళికి ఒప్పుకోకపోతే ఏమి చేస్తావు?" అని అజయ్ లావణ్యను అడిగాడు. "అమెరికా సంబంధం చేసుకొని మాత్రం వెళ్ళనులే" అన్నది కొంటెగా నవ్వుతూ. "నేను తమాషాకి అడగటం లేదు! నాకు తగిలిన దెబ్బ చాలు" అన్నాడు. "నేను కూడా తమాషా చేయటం లేదు . అయినా ఒప్పుకోకపోతే కదా ! నాకు నమ్మకం ఉన్నది. మా నాన్న ఒప్పుకుంటాడు" అని అన్నది. " మీ

అక్క కూడా ఇలానే చెప్పి అమెరికా పోయింది” అని అజయ్ అన్నాడు. “నేను ఇదివరకే మా నాన్నకి నీ గురించి చెప్పేశాను” అనటంతో అజయ్ ఆశ్చర్యపోయాడు. “ఏమి చెప్పావు?” అన్నాడు. “నాకు నువ్వంటే ఇష్టం అని చెప్పాను” అన్నాడు. “అప్పుడే మీ నాన్నకు చెప్పేశావా ? ఏమన్నాడు?” అని అడిగాడు అజయ్. “నీ ఇష్టం” అని చెప్పారు. “ అలా ఎలా ఒప్పుకున్నాడు?” అని అడిగాడు. “నీ పేరు, ఊరు, వివరాలు అన్నీ తీసుకున్నాడు. ఒక నెల ఎంక్వయిరీ చేశాక ఓకే చెప్పాడు” అన్నది. “నాకు తెలియకుండా ఇంత జరిగిందా!” అని ఆశ్చర్యపోయాడు అజయ్.

ఇప్పుడు కొంచెం ధైర్యం వచ్చింది అజయ్ కి. మళ్ళీ బండి పటాలెక్కింది. ఒక ఆరు నెలలు ఒకరినొకరు బాగా అర్థం చేసుకొని ప్రేమించుకున్నాక ,అజయ్ వాళ్ళ ఇంట్లో ఈ విషయాన్ని చెప్పాడు. “ఆ అమ్మాయికి పెళ్ళి అయిపోయింది అని చెప్పారు కదరా!” అని వాళ్ళ నాన్న అనుమానం వ్యక్తం చేశాడు. “ ఆ అమ్మాయికి పెళ్లి అయిన మాట నిజమే” అని ఇంకా చెప్పబోతుండగా . “ఛి ఛి పెళ్లై మొగుడున్న అమ్మాయిని మళ్ళీ పెళ్ళీ చేసుకుంటావా?” అన్నాడు ఆవేశంతో ఊగిపోతూ! “ ఆ అమ్మాయి వేరు ,ఈ అమ్మాయి వేరు నాన్న” అన్నాడు. వాళ్ళ నాన్న అయోమయం లో పడ్డాడు. “ఒక ఉద్యోగం పోతే ఇంకోటి దొరికినట్టు ఇంకో అమ్మాయిని ప్రేమించావా? ఇలా ఎంత మంది ఉన్నారు?” అని చమత్కరించాడు. “నీకు ఇష్టమైతే నాకు ఏ అభ్యంతరం లేదు” అన్నాడు. ఇంత త్వరగా ఒప్పుకుంటాడని అజయ్ అనుకోలేదు . వేణుని పిలిచి నాన్న ఒప్పుకున్న విషయం చెప్పాడు. “నువ్వు అడిగితే కాదు అంటాడేమో అన్న అనుమానం వచ్చి, నీ పురుగుల మందు కథ మీ నాన్నకు పైపైన చెప్పాను” అన్నాడు వేణు. ఆ మాటకు కోపం వచ్చినా పని జరిగినందుకు ఆనందపడ్డాడు.

ఇరు పక్షాల వాళ్ళు ఒప్పేసుకున్నారు. పెళ్లి కూడా నిర్ణయించేశారు. అమీర్ పేట బడికి ఒక నెల సెలవు ప్రకటించాడు అజయ్. ఇద్దరూ కలిసి సూది దగ్గర నుంచి శుభలేఖల దాకా పనులన్నీ దగ్గరుండి చూసుకున్నారు. పెళ్లి రోజు రానే వచ్చింది. వైభవంగా ఏర్పాట్లన్నీ చేశారు లావణ్య నాన్న గారు. అర్థరాత్రి పెళ్లి అవ్వటంతో ,ఆ రోజు రాత్రి రిసెప్షన్ లాంటిది ఏర్పాటు చేశారు. చూసే వారికి బాగానే

ఉంటుంది కానీ, పెళ్లి కొడుక్కి, పెళ్లి కూతురికి అరుంధతి నక్షత్రం సంగతేమో కానీ, నిజంగానే చుక్కలు కనిపిస్తాయి. ఏప్రిల్ ఎండలకు ఎంత ఏ.సి. వేసినా సరిపోదు. సూటులో నిలబడి వచ్చే ప్రతివాళ్ళకి దండం పెట్టాలి, నిలబడి ఫోటోలు దిగాలి చేతులు పిసకాలి, చెమటలు తుడుచుకోవాలి, ఫోటోల కోసం చికాకులో కూడా చిరునవ్వుతో ఉండాలి.

ఇది ప్రతి పెళ్ళిలో జరిగే తతంగమే. వెయ్యి ఫోటోలు తీస్తారు. వాటిని ఏమి చేసుకోవాలో కూడా అర్థం కాదు. చివరకి అచ్చు వేయించేవి వంద కూడా ఉండవు. ఏదో దిగాలి కాబట్టి ఫోటోలు తీస్తారు. ఇలా ఫోటోలు దిగుతూ ఉండగా ,అజయ్ తన జీవితంలో మళ్ళీ చూడకూడదనుకున్న మనిషిని చూశాడు. మొదట్లో “తనేనా కాదా ?” అని అనుమాన పడ్డా ,తనే అని తెలుసుకోవటానికి ఎక్కువ సేపు పట్టలేదు. నిషా ,తన భర్తతో కలిసి పెళ్ళికి వచ్చింది. కోపంతో ఊగిపోతూ “ఎందుకు పిలిచావు తనని పెళ్ళికి?” అని లావణ్యని అరిచాడు. “నాన్న పిలిచి ఉంటాడు.వాళ్ళు మాకు దూరపు చుట్టాలవుతారు” అని చెప్పింది. “ఈ విషయం నాకెందుకు చెప్పలేదు” అని కోపంతో అన్నాడు. అంతలో ఒకతను వచ్చి అజయ్ కి చెయ్యి చాపాడు. కళ్ళ ముందు కెమేరాలు ఉండటంతో మళ్ళీ చెమట తుడుచుకొని చిరునవ్వుతో అతనికి చెయ్యి ఇచ్చాడు.

అతను మరెవరో కాదు, నిషా భర్త! నిషా కూడా నవ్వుతూ లావణ్యను పలకరించింది. అజయ్ ని చూసి నవ్వింది, కానీ అజయ్ కోపంతో ముఖం తిప్పుకున్నాడు. “మీరు, నిషా క్లాస్ మేట్స్ అని చెప్పింది , నైస్ టూ మీట్ యు” అన్నాడు అతను. అజయ్ కి ఏమనాలో తెలియలేదు. “అవునవును క్లాస్ మేట్స్ ! నైస్ మీటింగ్ యు” అని ఫోటో దిగి వెళ్ళిపోయారు. అస్సలు ఏమీ తెలియనట్టు, ఏమీ జరగనట్టు నిషా ఎలా వచ్చిందా అని అజయ్ ఆశ్చర్యపోయాడు. “ నీకు వాళ్ళు చుట్టాలవుతారని ఇంజనీరింగ్ లోనే తెలుసా ?” అని అడిగాడు లావణ్యని. “ ఆ అమ్మాయికి పోయినేడు పెళ్లి అయితే , నాకు ఇంజనీరింగ్ లో ఎలా తెలుస్తుంది” అన్నది లావణ్య. “ నిషా భర్త మాకు చుట్టాలు” అని చెప్పింది. అజయ్ కి పాత

జ్ఞాపకాలు గుర్తుకు వచ్చే లోపే ఇంకొకతను వచ్చి చెయ్యి చాపాడు. అజయ్ మళ్ళీ మామూలుగా, చెమట తుడుచుకొని, వచ్చినతని చెయ్యి పిసికి చిరునవ్వుతో ఫోటోలు ఫోజులిచ్చాడు.

చూస్తుండగానే రోజులు వేగంగా గడిచాయి. అజయ్ కి, ఇటు పెళ్ళాం, పిల్లలు, అటు ఆఫీసు, అమీర్ పేటలో క్షణం తీరిక లేకుండా చేతులు ఖాళీ లేకుండా సంపాదించేస్తున్నాడు. ఒక ఆదివారం సాయంత్రం, లావణ్య పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్ళింది. ఒంటరిగా టి.వి చూస్తూ చానళ్ళు మారుస్తున్నాడు అజయ్. ఒక చానల్లో మళ్ళీ రామాయణ ప్రవచనం వస్తున్నది. అజయ్ మైమరచిపోయి విన్నాడు. అది పూర్తి అయ్యాక, బయట బాల్కనీలో పడక కుర్చీలో కూర్చొని ఆలోచించటం మొదలు పెట్టాడు. ఒక్క క్షణంలో ఆరేడేళ్ళు వెనక్కి వెళ్ళిపోయాడు. తానూ దరిద్రంలో బతికిన ఆ రోజులని గుర్తుకు తెచ్చుకున్నాడు. తాను నిద్ర లేకుండా గడిపిన రాత్రులను ,తాను చావాలనుకున్న చావులను తలచుకుంటే, అజయ్ కి నవ్వొచ్చింది. కుర్రతనంతో చావే అన్నిటికీ పరిష్కారం అనుకోని చావటం ఎంత తప్పో, ఇప్పుడు అజయ్ కి తప్ప మరెవ్వరికీ తెలియదు. జీవితంలో కష్టాలు ఆకాశంలో మబ్బుల్లాంటివి, కాసేపు కురిసిపోతాయి తప్పించి, శాశ్వతం కాదు అన్న సత్యాన్ని గ్రహించిన రోజు ఎంత కష్టాన్నైనా సులువుగా దాటవచ్చు. "ఆశే జీవితం ,భాదే మరణం" అన్న సత్యాన్ని గ్రహించే ప్రతివాడు అజేయుడే.

(సమాప్తం)

For Latest Telugu Books - Visit now:
Kinige.com